క్లుప్తంగా

సీజనల్ వ్యాధులపై అప్రమత్తత తప్పనిసరి



మాచర్ల రూరల్: సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని డీఎంహెచ్‌ఓ డాక్టర్ రవి అన్నారు. మంగళవారం తాళ్ళపల్లి, కొప్పునూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను ఆయన పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వర్షాకాలంలో వ్యాధుల నేపథ్యంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో అన్ని సౌకర్యాలను ఏర్పాటు చేసుకోవాలన్నారు. రోగులతో సిబ్బంది సఖ్యతతో మెలగాలని సూచించారు. అనంతరం వైద్యులకు పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్లు వెస్లీ, ప్రవీణ్, సిబ్బంది పాల్గొన్నారు.

విధి నిర్వహణలో అలసత్వం తగదు

గురజాల: విధి నిర్వహణలో అలసత్వం వహించవద్దని తహసీల్దార్ కె.నాగేష్ పేర్కొన్నారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో మంగళవారం బీఎల్‌వోలతో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇంటింటి సర్వేను విధిగా నిర్వహించాలన్నారు. తప్పులు లేని ఓటర్ జాబితాను సిద్ధం చేయాలని ఆదేశించారు. మృతుల వివరాలు సేకరించి ఓటర్ జాబితా నుంచి తొలగించాలని స్పష్టం చేశారు. అలసత్వం వహిస్తే ఉపేక్షించేది లేదన్నారు. ఎలక్షన్ డీటీ సుబ్బారావు పాల్గొన్నారు.

బీజేపీతోనే దేశాభివృద్ధి సాధ్యం



రెంటచింతల: భారతీయ జనతా పార్టీతోనే దేశాభివృద్ధి సాధ్యమని మాచర్ల నియోజకవర్గ పార్టీ కన్వీనర్ జి. నాసరయ్య అన్నారు. రెంటచింతలలో మండల అధ్యక్షుడు సూరపరెడ్డి పుల్లారెడ్డి ఆధ్వర్యంలో బీజేపీ సంస్థాగత సభ్యత్వ నమోదు కార్యక్రమం ప్రారంభించారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రతి గ్రామంలో గణనీయ స్థాయిలో సభ్యత్వం నమోదు చేసి, గ్రామస్థాయి నుంచి పార్టీ బలోపేతం చేయడానికి కృషి చేయాలని కోరారు. పార్టీ జిల్లా కార్యదర్శి పోలిశెట్టి శ్రీనివాసరావు, మండల మాజీ అధ్యక్షుడు సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శి వరప్రసాదరావు, ఎస్సీ మోర్చా నియోజకవర్గ ఇన్‌చార్జి విజయ్‌కుమార్, యువ మోర్చా జిల్లా ఉపాధ్యక్షుడు పూర్ణచంద్రరావు పాల్గొన్నారు.

విశ్వకర్మ యోజన లబ్ధికి వినతి పత్రం అందజేత

రెంటచింతల: గ్రామీణ ప్రాంతాల్లో చేతి వృత్తులు చేసుకునే 18 కులాల పేద మహిళలకు చేయూత నందించేందుకు ప్రధాని నరేంద్ర మోదీ ప్రవేశపెట్టిన పీఎం విశ్వకర్మ యోజన ఒక వరమని ఎంపీడీవో యల్లా మహాలక్ష్మి అన్నారు. మంగళవారం బహుజన కళాకారుల ఉద్యమ నాయకుడు జెట్టిపాలెం వెంకటేష్ నేతృత్వంలో వివిధ గ్రామాలకు చెందిన పేద మహిళలు పీఎం విశ్వకర్మ యోజన ద్వారా ఆదుకోవాలని ఎంపీడీఓకు వినతి పత్రం అందజేశారు. అనంతరం ఎంపీడీవోను ఘనంగా సన్మానించారు. ఏపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాయపాటి జయమ్మ, వేల్పుల కుమారి, వేల్పుల మల్లయ్య, మున్నా నాగేంద్రమ్మ, అంబటి అనుషా నాయుడు, రాయపాటి ప్రసాద్, కడియం సత్తమ్మ, తిక్కా చౌడమ్మ, జి.ప్రభుదాస్ తదితరులున్నారు.

అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలి



నరసరావుపేట: అంగన్‌వాడీల న్యాయమైన అన్ని సమస్యలను పరిష్కరించాలని ఏపీ అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సీఐటీయూ) జిల్లా ప్రధాన కార్యదర్శి గుంటూరు మల్లీశ్వరి డిమాండ్ చేశారు. డిమాండ్ల సాధనకు గత ప్రభుత్వ హయాంలో అంగన్‌వాడీలు చేపట్టిన సమ్మె సందర్భంగా గత ప్రభుత్వం ఇచ్చిన హామీలను మరింత మెరుగ్గా ప్రస్తుత ప్రభుత్వం అమలు చేయాలని కోరుతూ స్థానిక పీడీ కార్యాలయంలో మంగళవారం సూపరింటెండెంట్ బాబురావుకు వినతిపత్రం అందజేశారు. మల్లీశ్వరి మాట్లాడుతూ సమ్మె సందర్భంగా టీఏలు, డీఏలు ఇస్తామని ప్రకటించినప్పటికీ ఒక రూపాయి కూడా ఇవ్వలేదని మండిపడ్డారు. తమ సమస్యలు పరిష్కరించకుండా నిర్లక్ష్యం చేస్తే పోరాటం చేస్తామని హెచ్చరించారు. జిల్లా నాయకులు నిర్మల, సాయికుమారి పాల్గొన్నారు.

నిమజ్జనోత్సవాలు



మాచర్లలో వినాయకుని ఊరేగింపు



మాచర్ల నుంచి సాగర్‌కు వెళ్లే మార్గంలో నిమజ్జనానికి వెళ్తున్న లంబోదరుడు



పిడుగురాళ్లలో ప్రత్యేక పూజలో పాల్గొన్న తహసీల్దార్ ఎన్. మధుబాబు, సీఐ శ్రీరాం వెంకట్రావు



దాచేపల్లి పెదగార్లపాడులో లడ్డూ దక్కించుకున్న ముత్యం సురేంద్రరెడ్డి

మాచర్ల: వినాయక చవితి సంబరాలు 4వ రోజు కొనసాగాయి. ఆయా ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన వినాయక విగ్రహాలను 3వ రోజు కదిలించి మంగళవారం నిమజ్జనం చేశారు. బాణ సంచా పేలుస్తూ, గులాం నృత్యాలు ఊరేగింపులు కొనసాగాయి. పలు ప్రాంతాల్లో మండపాల వద్ద పూజా కార్యక్రమాలు నిర్వహించి, అన్నదాన కార్యక్రమాలు చేశారు.

- పిడుగురాళ్ల: పట్టణంలోని బ్రహ్మానందరెడ్డి కాలనీలో ఏర్పాటు చేసిన వినాయక విగ్రహం వద్ద మంగళవారం మహా అన్నదానం నిర్వహించారు. స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఎస్‌బీఐ మెయిన్ సెంటర్‌లో ఏర్పాటు చేసిన వినాయక పందిరి వద్ద కూడా అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.
- రెంటచింతల: గ్రామాల్లో ఉత్సవ కమిటీలు సుమారు 72 గణేష్ విగ్రహాలను చివిత ఉత్సవాలకు నెలకొల్పాయి. మంగళవారం మేళతాళాలతో నిమజ్జన ఊరేగింపులు ఉత్సాహంగా జరిగాయి. శ్రీ వాసవి దేవస్థానంలోని వినాయకుడి లడ్డూని కొలిశెట్టి సాంబశివరావు రూ.71 వేలకు దక్కించుకున్నారు. బస్‌స్టాండ్ సెంటర్లోని మండపంలో కొండేటి వెంకటేశ్వర్లు రూ.50 వేలకు లడ్డూను కైవశం చేసుకున్నారు.
- దాచేపల్లి : వినాయకుడి విగ్రహాల వద్ద ప్రత్యేక పూజలు మంగళవారం జరిగాయి. పెదగార్లపాడులో ఏర్పాటు చేసిన వినాయకుడి విగ్రహం వద్ద జరిగిన వేలంలో లడ్డూని ముత్యం మోహన్ సురేంద్రరెడ్డి రూ.12వేలకు దక్కించుకున్నాడు. సర్పంచ్ కర్పూరపు వెంకటకోటయ్య, నాయకులు ముత్యం చెన్నారెడ్డి పూజలు చేశారు. దాచేపల్లిలోని శ్రీ వీర్ల అంకమ్మతల్లి దేవాలయం వద్ద ఏర్పాటు చేసిన వినాయకుడి విగ్రహానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.
- కారెంపూడి లడ్డూ రూ.1,75,000లు

కారెంపూడి: మండలంలో మంగళవారం సాయంత్రం గణేష్ నిమజ్జనోత్సవాలు వైభవంగా జరిగాయి. అనంతరం సాగర్ కాల్వలో నిమజ్జనం చేశారు. కారెంపూడి ఆర్యవైశ్య యువజన సంఘం ఏర్పాటు చేసిన వినాయక ఉత్సవ లడ్డూ వేలం రూ.1,75,000 పలికింది. ఆతుకూరి కృష్ణారావు దీనిని దక్కించుకున్నారు.



కారెంపూడి: నిమజ్జనానికి తరలివెళ్తున్న గణనాథుడు



దాచేపల్లిలోని అంకమ్మతల్లి దేవాలయంలో వినాయకుడికి పూజలు



బ్రహ్మానందరెడ్డి కాలనీలో అన్నదానం



రెంటచింతలలో నిమజ్జనానికి తరలివెళ్తున్న గణనాథుడు

దోమల నివారణతో విష జ్వరాలు దూరం



గ్రామస్తులకు అవగాహన కల్పిస్తున్న అంకమ్మరావు

రెంటచింతల: నివాస పరిసరాల పరిశుభ్రతతోనే దోమల నివారణ సాధ్యమవుతుందని, సీజనల్ జ్వరాలు దరిచేరవని మలేరియా సబ్ యూనిట్ ఆరోగ్య పర్యవేక్షకుడు సీహెచ్ అంకమ్మరావు అన్నారు. మంగళవారం ఆరోగ్య, ఆశ కార్యకర్తలతో కలిసి మల్లవరం గ్రామంలో ఇంటింటి సర్వే చేపట్టారు. మలేరియా, డెంగీ, టైఫాయిడ్‌పై ప్రజలకు అవగాహన కల్పించారు. నివారణ చర్యలు వివరించారు. దోమల నివారణకు మురుగు నీరు తొలగించి, సైడు కాల్వల్లో కిరోసిన్, బ్లీచింగ్ చల్లుకోవాలని వివరించారు. హఠాత్తుగా వచ్చే తీవ్రమైన జ్వరం, భరించలేని తలనొప్పి, చర్మంపై దద్దుర్లు వంటి లక్షణాలు డెంగీ వ్యాధి లక్షణాలుగా గుర్తించి, వెంటనే వైద్యులను సంప్రదించాలన్నారు. సూపర్‌వైజర్ బాషా, హెల్త్ అసిస్టెంట్స్ ఖాసిం, మహేష్ బాబు, శివ, బాలయ్య, ఏఎన్‌ఎంలు అంజలి తదితరులు పాల్గొన్నారు.

విశాఖ ఉక్కు ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ర్యాలీ



ర్యాలీ చేస్తున్న సీపీఐ, సీఐటీయూసీ నాయకులు

దాచేపల్లి: విశాఖ ఉక్కు ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా సీపీఐ, కాంగ్రెస్, సీఐటీయూసీ ఆధ్వర్యంలో మంగళవారం ర్యాలీ నిర్వహించారు. నారాయణపురం ఆర్‌అండ్‌బీ బంగ్లా సెంటర్ నుంచి ర్యాలీ చేపట్టి.. బంగ్లా సెంటర్‌లో రాస్తారోకో చేశారు. కేంద్ర ప్రభుత్వం తక్షణమే ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం విజయవాడ వరద బాధితులకు సహాయార్థం విరాళాలు సేకరించారు. సీపీఐ నాయకులు కొమెర వెంకట్రావ్, షేక్ హుస్సేన్, మండపాటి రమణారెడ్డి, వేముల వెంకటరెడ్డి, తెలనాకుల సత్యనారాయణ, తమ్మిశెట్టి శ్రీరాములు, కాంగ్రెస్ ఇన్‌చార్జి కరాలపాటి జానీ పాల్గొన్నారు.

పౌష్టికాహారంపై అవగాహన



యోగా చేస్తున్న అంగన్‌వాడీ టీచర్లు

పిడుగురాళ్ల: గర్భిణులు, బాలింతలు సరైన పౌష్టికాహారం తీసుకోవాలని అయుష్ శాఖ వైద్యులు డాక్టర్ మేఘమాల అన్నారు. పట్టణంలోని ఐసీడీఎస్ కార్యాలయంలో అంగన్‌వాడీ కార్యకర్తలకు పౌష్టికాహార మాసోత్సవాల సందర్భంగా అవగాహన కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలు పౌష్టికాహారం తీసుకునేలా అంగన్‌వాడీ కార్యకర్తలు చర్యలు తీసుకోవాలన్నారు. సమస్యలు ఉంటే వెంటనే తెలియజేసేలా వారికి అవగాహన కల్పించాలన్నారు. అంగన్‌వాడీ టీచర్లకు యోగాపై శిక్షణనిచ్చారు. ఐసీడీఎస్ ఇన్‌చార్జి సీడీపీవో రుక్సానా బేగం, సూపర్‌వైజర్లు టి.ప్రసన్నకుమారి, పోట్ల అంజలి, బి.అన్నపూర్ణ, యోగా టీచర్ కోటేశ్వరమ్మ పాల్గొన్నారు.

విద్యుత్ అక్రమ వినియోగదారులపై కొరడా

- 3502 సర్వీసులు తనిఖీ.. రూ.10.27లక్షల అపరాధ రుసుం
- నరసరావుపేట డీ–2సెక్షన్‌లో విజిలెన్స్, ఆపరేషన్ విభాగ అధికారుల దాడులు



వివరాలను వెల్లడిస్తున్న అధికారులు

నరసరావుపేట: విద్యుత్‌ను అక్రమంగా వినియోగిస్తున్న వారిపై ఆశాఖ అధికారులు కొరడా ఝుళిపించారు. మంగళవారం నరసరావుపేట డీ–2 సెక్షన్ పరిధిలో విద్యుత్‌శాఖ విజిలెన్స్, ఆపరేషన్ విభాగ అధికారులు టీంలుగా ఏర్పడి విస్తృత తనిఖీలు చేశారు. 3502 సర్వీసులు పరిశీలించి అక్రమంగా విద్యుత్ వినియోగిస్తున్న వారిపై రూ.10.27లక్షల అపరాధ రుసుం విధించారు. కార్యాలయంలో విజిలెన్స్, ఆపరేషన్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు కె.సూర్యప్రకాష్, ఎస్.శ్రీనివాసరావులు వివరాలను విలేకర్లకు వెల్లడించారు. ప్రకాష్‌నగర్, వరవకట్ట, అరండల్‌పేట, రామిరెడ్డిపేట, ఇస్లాంపేట, 60 అడుగులరోడ్డు ప్రాంతాల్లో 92 మంది అధికారులు, 276 మంది సిబ్బంది 92 బృందాలుగా ఏర్పడి సర్వీసులను తనిఖీ చేయటం జరిగిందన్నారు. అనుమతించిన కేటగిరీ కాకుండా ఇతర కేటగిరీలలో విద్యుత్ వాడుకుంటున్న ఇద్దరికి రూ.10 వేలు, అదనంగా విద్యుత్ లోడు వాడుతున్న 193 మందికి రూ.10.17 లక్షల అపరాధ రుసుం విధించారన్నారు. ఈ సందర్భంగా వినియోగదారులకు కొన్ని సూచనలు చేశారు. తప్పనిసరిగా విద్యుత్ మీటర్లకు సీలు ఉండేలా చూసుకోవాలన్నారు. లేనిపక్షంలో సిబ్బందికి తెలియచేయాలని సూచించారు. భారత విద్యుత్ చట్టం సెక్షన్ 135 ప్రకారం పనిచేయని మీటరు నుంచి విద్యుత్ వాడుకున్న, ఉండాల్సిన మీటరుకు బదులుగా వేరే మీటరు ద్వారా సీలు లేకుండా విద్యుత్ వాడుకున్న విద్యుత్ చౌర్యం కింద పరిగణించి అపరాధం రుసుం వసూలు చేయబడుతుందని చెప్పారు. మొదటి సారి తప్పిదానికి మూడురెట్లు, రెండోసారి తప్పిదానికి ఆరురెట్లు జరిమానా విధించటం జరుగుతుందన్నారు. విద్యుత్ చౌర్యం సామాజిక నేరంగా పరిగణిస్తూ అటువంటి వాటిపై 94408 12263, 94408 12360, 94408 12361 నంబర్లకు నేరుగా కాని, వాట్స్‌ప్‌కు గాని సమాచారం అందజేయాలని కోరారు. ఈ దాడుల్లో డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు ఎం.రవికుమార్, కె.రవికుమార్, వై.ఏడుకొండలు, ఏఈలు కె.కోటేశ్వరరావు పాల్గొన్నారు.

విద్యార్థుల్లో సామర్థ్యాలు వెలికితీయండి

శావల్యాపురం: విద్యార్థుల్లో సామర్థ్యాలు వెలికితీయడానికి ప్రతిభ పరీక్షలు నిర్వహించాలని ఎంఈవో మద్దికుంట సాంబశివరావు అన్నారు. మంగళవారం మండలంలోని పోట్లూరు గ్రామం ఎంపీపీ స్కూల్‌ను సందర్శించారు. ఆయనతో పాటు ఎంఈవో–2 పుసులూరి లలితాకుమారి, ప్రధానోపాధ్యాయురాలు లక్ష్మీకుమారి ఉన్నారు.

ప్రతి ఒక్కరు మొక్కలు నాటాలి

నరసరావుపేట రూరల్: పర్యావరణ పరిరక్షణకు ప్రతిఒక్కరు మొక్కలు నాటాలని శంకరభారతీపురం జెడ్పీ హైస్కూల్ ప్రధానోపాధ్యాయినీ ఎం.పార్వతి తెలిపారు. పాఠశాల స్కౌట్స్ అండ్ గైడ్స్ ఆధ్వర్యంలో మంగళవారం మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయినీ పార్వతి, స్కౌట్ విద్యార్థుల అసిస్టెంట్ లీడర్ ట్రైనర్ పమ్మి వెంకటరెడ్డి, ఎన్‌సీసీ ఆఫీసర్ ఎస్‌కె.ఫాతిమాలు తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణలో భాగస్వాములు కావాలి

వర్సిటీ ఎన్‌ఎస్‌ఎస్ కో–ఆర్డినేటర్ డాక్టర్ దివ్య తేజోమూర్తి



నరసరావుపేట ఈస్ట్: పర్యావరణ పరిరక్షణలో విద్యార్థులు భాగస్వాములై మొక్కలు నాటాలని ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం ఎన్‌ఎస్‌ఎస్ కోఆర్డినేటర్ డాక్టర్ దివ్య తేజోమూర్తి తెలిపారు. పట్టణంలోని వివిధ కళాశాలల్లోని ఎన్‌ఎస్‌ఎస్ విభాగాల నిర్వహణను మంగళవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయా కళాశాలల ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం అధికారులతో మాట్లాడారు. ఈసందర్భంగా శ్రీసుబ్బరాయ అండ్ నారాయణ కళాశాలలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎం.ఎస్.సుధీర్, వైస్‌ప్రిన్సిపల్ డాక్టర్ పి.శ్రీనివాససాయి, ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్లు డాక్టర్ ఏ.సరళాదేవి, టి.వి.శంకరరెడ్డి, రాజనాల వేణుమాధవ్, పి.శ్రీనివాసులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

వాగ్దేవి కళాశాలలో...

వాగ్దేవి కళాశాలను సందర్శించిన వర్సిటీ ఎన్‌ఎస్‌ఎస్ కోఆర్డినేటర్ దివ్యతేజోమూర్తి మొక్కలు నాటి విద్యార్థులతో మాట్లాడారు. కార్యక్రమంలో కళాశాల కార్యదర్శి రాయల శ్రీనివాసరావు, ప్రిన్సిపల్ కపలవాయి రాజేంద్రప్రసాదు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఘనంగా మిలాద్ ఉన్ నబి

వినుకొండ(నూజెండ్ల): పట్టణంలోని సాధన ఇనిస్టిట్యూట్‌లో డైరెక్టర్ ఎస్‌కెఎం బాషా ఆధ్వర్యంలో మిలాద్ ఉన్ నబి మాసోత్సవా లు ఘనంగా జరిగాయి. ముఖ్యఅతిథిగా వినుకొండ ఎంఈఓ సయ్యద్ జఫ్రుల్లా హాజరై ప్రసంగించారు. కవి కరిముల్లా, సాంఘిక ఉపాధ్యాయులు కోటేశ్వరరావు పాల్గొన్నారు.

ఐలమ్మకు ఘన నివాళి



చిట్యాల ఐలమ్మ విగ్రహానికి రజక సంఘ నాయకుల నివాళి

మాచర్ల: స్వాతంత్ర్య సమర యోధురాలు, తెలంగాణ ఉద్యమ కారిణి ఐలమ్మ పోరాటం నేటి తరానికి స్ఫూర్తిదాయకమని చాకలి ఐలమ్మ సేవా సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు మన్నెం పాండు రంగారావు, న్యాయవాది కేశం శ్రీనివాసరావు అన్నారు. మంగళవారం పట్టణంలోని లాడ్జి సెంటర్‌లో ఐలమ్మ విగ్రహానికి పాండు, శ్రీనివాసరావు, రెవెన్యూ ఆర్ఐ శ్రీనివాసరావు, డీటీ శ్రీనివాసరావు, వాసవి క్లబ్ అధ్యక్షుడు ఓరుగంటి చెన్నకేశవరావు, డాక్టర్ సైదులు, యేచూరి సురేష్ ఆమె విగ్రహానికి పూలమాలలు వేసి, నివాళులర్పించారు.

వీర వనిత ఐలమ్మ

పిడుగురాళ్ల: తెలంగాణ భూ పోరాటానికి నాంది పలికిన వీరమాత చిట్యాల ఐలమ్మ అని పిడుగురాళ్ల రజక సంఘ నాయకులు, పిడుగురాళ్ల మున్సిపల్ కో– ఆప్షన్ సభ్యులు శెట్టుపల్లి పూర్ణ రజక అన్నారు. పట్టణంలోని పిల్లట్ల రోడ్డులో ఉన్న చిట్యాల ఐలమ్మ విగ్రహానికి మంగళవారం ఆమె నివాళులర్పించారు. పూర్ణ మాట్లాడుతూ... భూమి కోసం ఆదిపత్య వర్గాల భూ అక్రమణలకు వ్యతిరేకంగా పోరాడి, అనగారిన వర్గాలకు మద్దతుగా ఐలమ్మ నిలిచిందన్నారు. రజక సంఘ నాయకులు మేర్ల కోటేశ్వరరావు, కంభంపాటి పెద వెంకటేశ్వర్లు, దేవరపు కొండలు, గుర్రపుసాల సాంబయ్య, పొట్టూరి శివ, రమణ, సుబ్బారావు, చిరంజీవి, వాసు, స్వామి తదితరులు పాల్గొన్నారు.

కృష్ణానది ప్రవాహాన్ని పరిశీలించిన డీపీఓ



గ్రామస్తులతో మాట్లాడుతున్న డీపీఓ విజయ భాస్కర్‌రెడ్డి

మాచవరం: కృష్ణానది పరీవాహక ఎగువ ప్రాంతాన అధిక వర్షాల కారణంగా వరద నీటి ప్రవాహం దిగువనకు అధికంగా రావడంతో మండలంలోని గోవిందాపురం గ్రామ సమీపంలోని కృష్ణానది ప్రవాహాన్ని పల్నాడు జిల్లా పంచాయతీ అధికారి బి. విజయభాస్కర్‌రెడ్డి మంగళవారం పరిశీలించారు. గ్రామస్తులను కలిసి వారితో మాట్లాడారు. నీటి ప్రవాహం ఎక్కువగా ఉండడంతో నదిలోకి ఎవరూ వెళ్లవద్దని, తగు జాగ్రత్తలు పాటించాలని సూచించారు. అధికారులు అందుబాటులో ఉంటూ అప్రమత్తంగా ఉండాలని తెలియజేశారు. ఏమైనా సమస్యలు ఉంటే అధికారులకు తెలియజేయాలని సూచించారు. అనంతరం మండల కేంద్రమైన మాచవరం గ్రామ సచివాలయాన్ని సందర్శించారు. సిబ్బందితో మాట్లాడారు. పలు రికార్డులను పరిశీలించారు. ప్రజలకు అందిస్తున్న ప్రభుత్వ సేవలు గురించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట ఈఓపీఆర్‌డీ వెంగళరావు, గ్రామ అధికారులు, గ్రామస్తులు ఉన్నారు.

సస్యరక్షణతో నారుమడుల్లో తెగుళ్ల నివారణ



ఈపూరులో వరినారును పరిశీలిస్తున్న సైంటిస్టులు, వ్యవసాయాధికారులు

శావల్యాపురం: అకాల వర్షాల వల్ల వరినారుమడుల్లో తెగుళ్ల నివారణకు రైతులు సత్వరమే సస్యరక్షణ చర్యలు చేపట్టాలని గుంటూరు లాంఫాం సీనియర్ శాస్త్రవేత్త ఎస్.సాంబశివరావు సూచించారు. మంగళవారం మండలంలోని వేల్పూరు గ్రామంలో అకాల వర్షాల వలన తెగుళ్ల సోకిన వరి నారుమడులను పరిశీలించి అనంతరం రైతు సేవా కేంద్రంలో సస్యరక్షణ చర్యలపై రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తలు తదితరవాటి గురించి అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సీనియర్ శాస్త్రవేత్త సాంబశివరావు మాట్లాడుతూ అకాల వర్షాల ధాటికి వరి నారుమడుల్లో వరిలో కాండం కుళ్ళు తెగులు, ఇనుప ధాతులోపం, ఎదుగుదల లోపం తెగుళ్ల సోకిందని వ్యవసాయ అధికారుల సూచనలు మేరకు రైతులు సత్వరమే సస్యరక్షణ చర్యలు చేపట్టాలన్నారు.

వరి నారుమడులు పరిశీలించిన వారిలో లాంఫామ్ శాస్త్రవేత్తలు పి.అమరజ్యోతి, యం.వెంకటేశ్వర్లు, డీఏ మద్దినేని శివకుమారి, ఏడీఏ బోయపాటి రవిబాబు, ఏవోలు రామినేని రామారావు, పల్లపోతుల ప్రవీణ్, ఏఈవో పురేటి అశోక, వీఏఏలు హరిబాబు, అనుషా, రైతులు పాల్గొన్నారు.

నర్సరీల పరిశీలన

ఈపూరు: మండలంలోని కొండాయపాలెం గ్రామంలోని పొలాలను లాం సీనియర్ సైంటిస్టులు, నరసరావుపేట డాట్ సెంటర్ సీనియర్ సైంటిస్టులు మంగళవారం సందర్శించారు. గ్రామంలోని వరి నర్సరీలను వారు పరిశీలించారు. నాట్లు వేసిన తరువాత వచ్చే తెగుళ్లను అరికట్టేందుకు నారు దశలోనే అధికారులు తెలిపిన మందులను వినియోగించాలన్నారు.

నరసరావుపేట రూరల్‌లో...

నరసరావుపేట రూరల్: పత్తిలో పిండి నల్లి, పేను బంక, తెల్లదోమ, పచ్చ దోమ నివారణకు రైతులు చర్యలు తీసుకోవాలని శాస్త్రవేత్తలు తెలిపారు. మండలంలోని యల్లమంద గ్రామంలోని పత్తి పంటలను వ్యవసాయ శాస్త్రవేత్తలు మంగళవారం పరిశీలించారు. పత్తిలో పిండి నల్లి నివారణ చర్యలను తెలియజేశారు.

ప్రయాణం.. నరక ప్రాయం



దాచేపల్లి-కారంపూడి రోడ్డులో అడుగు లోతున గుంత



దాచేపల్లి-ముత్యాలంపాడు రోడ్డులో గుంత



దాచేపల్లి-మాదినపాడు రోడ్డు ఇలా..

మండల పరిధిలో పలు గ్రామాలకు వెళ్లే రోడ్లు గుంతల మయంగా మారాయి. వాహనదారులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దాచేపల్లి నుంచి తంగెడ, మాదినపాడు, కేసానుపల్లి, పెదగార్లపాడు వెళ్లే రోడ్లలో గోతులు ప్రమాదానికి ఆహ్వానిస్తున్నాయి. ఒక్కో గుంత అడుగులోతు కంటే ఎక్కువే ఉంది. ఒక్కసారి వాహనదారులు ఈ గోతుల్లో పడితే..హాస్పిటల్ బెడ్డు ఎక్కాల్సిందే. – దాచేపల్లి